క్లుప్తంగా

62 యూనిట్ల రక్తం సేకరణ



రక్తదానం చేస్తున్న యువత

బొబ్బిలి: రక్తదానం ప్రాణదానంతో సమానమని అవేర్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు మనోజ్‌కుమార్ అన్నారు. రక్తదాన దినోత్సవం సందర్భంగా బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. దాతల నుంచి 62 యూనిట్ల రక్తాన్ని సేకరించి బ్లడ్ బ్యాంక్‌కు అందజేసినట్లు చెప్పారు.

సామూహిక అక్షరాభ్యాసం



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకులు జోగారావు శర్మ

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట వినాయక ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు జోగారావు శర్మ 45 మంది పిల్లలతో అక్షరాభాసం చేయించారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలానికి చెందిన మానవతా సేవా సంఘం చైర్మన్ బాలు యాదవ్ చిన్నారులకు పలక, బలపం, నోట్‌బుక్స్, పెన్నులు ఉచితంగా అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి



ప్రవేశాలు పొందిన విద్యార్థులతో హెచ్‌ఎం సత్యనారాయణ

బాడంగి: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రవేశాలు ఊపందుకున్నాయి. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం ఒక్కరోజే 30మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించినట్లు హెచ్‌ఎం డి.సత్యనారాయణ తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు నాడు–నేడు కార్యక్రమం కింద పాఠశాలల్లో కల్పించిన మౌలిక వసతులను చూసి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు చెప్పారు.

కొలతల మేరకే వేతనం

రామభద్రపురం: ఉపాధి వేతనదారులు వారికి ఇచ్చిన కొలతల ప్రకారం పని పూర్తిచేస్తే పూర్తి వేతనం పడుతుందని ఏపీఓ ఆర్.హరినాథ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు బుధవారం వెళ్లి మస్తర్లు తనిఖీ చేశారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనులు చేయాలని, ఇచ్చిన కొలతలు పూర్తి చేయాలని సూచించారు. జాబ్‌కార్డు ఉన్నవారు పని కావాలని అడిగితే వెంటనే పని కల్పిస్తామన్నారు. డిమాండ్ పెట్టిన తర్వాత పనికి రాకపోతే వందరోజుల్లో వారం రోజులు పోతాయన్నారు.

ఆమిటిలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ దీక్షితారాణి

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెర్లాం పీహెచ్‌సీ డాక్టర్ దీక్షితారాణి కోరారు. మండలంలోని ఆమిటి గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధులు, గర్భిణులకు వైద్య సేవలు అందించారు. తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

సురక్షిత తాగునీరు అందించాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించాలని ఎంఈఓ జె.త్రినాథరావు అన్నారు. మండలంలోని ఎం.ఆర్ అగ్రహారం ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులు, మరుగుదొడ్ల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు, ఆర్‌ఓ ప్లాంట్ పనితీరును పరిశీలించారు. మధ్యాహ్న భోజనం మెనూ కచ్చితంగా అమలయ్యేలా చూడాలన్నారు. బడిఈడు పిల్లలను గుర్తించి వారంతా పాఠశాలలో చేరేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని సూచించారు.

నెరవేరిన సొంతింటి కల



తెర్లాంలో జగనన్న లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

- నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు
- బొబ్బిలి నియోజకవర్గంలో 10,924 ఇళ్లు మంజూరు
- 5,478 ఇళ్ల నిర్మాణాలు పూర్తి
- సొంతింటి కల నెరవేరబోతోందని లబ్ధిదారుల్లో ఆనందం

బొబ్బిలి నియోజకవర్గంలో..

మంజూరైన ఇళ్లు	10,924
నిర్మాణంలో ఉన్నవి	1,631
పునాది దశలో ఉన్నవి	2,859
గోడలు దశలో ఉన్నవి	731
శ్లాబులు పూర్తయినవి	225
ఇళ్లు పూర్తయినవి	5,478

తెర్లాం: ఎన్నో ఏళ్లుగా సొంతిల్లు లేక అద్దె ఇంట్లో కాలం వెళ్లబుచ్చుతున్న ఎంతో మందికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని సొంతింటి కల నెరవేరబోతోంది. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సిఫార్సు లేనిదే ఇల్లు మంజూరయ్యేదికాదు. అక్కడక్కడా ఒకటి రెండు ఇళ్లు మంజూరు చేసినా అవి టీడీపీ కార్యకర్తలకే ఇచ్చేవారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎలాంటి సిఫార్సు లేకుండానే అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సాయం చేస్తోంది. బొబ్బిలి నియోజకవర్గంలో బొబ్బిలి మున్సిపాలిటీతోపాటు, బొబ్బిలి, తెర్లాం, బాడంగి, రామభద్రపురం మండలాలు ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో ఏకంగా 10,924 ఇళ్లు మంజూరయ్యాయి. 109 జగనన్న లేఅవుట్లలో 4,186 మందికి, సొంత స్థలాలు ఉన్న 6,738 మందికి ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలె 5,478 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

జగనన్నకు రుణపడి ఉంటాం..



ఈ ఫోటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు అలమండ రమేష్. తెర్లాం గ్రామం. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సొంతిల్లు లేకపోవడంతో గత కొన్నేళ్లుగా అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. కుటుంబ పోషణ, ఇంటి అద్దె చెల్లించేందుకు చిన్నచిన్న ఎలక్ట్రిషియన్ పనులు చేస్తున్నాడు. గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరు కాలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం కింద తెర్లాంలోని జగనన్న లేఅవుట్‌లో ఇంటి స్థలం, ఇల్లు మంజూరైంది. ప్రస్తుతం ఇంటి నిర్మాణం 80శాతం పూర్తయింది. త్వరలోనే పనులు పూర్తి చేసి గృహప్రవేశానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి సిఫార్సు లేకుండా తన కుటుంబానికి ఇంటి స్థలం, ఇళ్లు మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌కు ఎల్లప్పుడు రుణపడి ఉంటామని, ఇన్నేళ్ల తరువాత తమకు సొంత ఇంటి కల నెరవేరబోతున్నందుకు ఆనందంగా ఉందని రమేష్ అంటున్నారు.

జగనన్న మేలు మరువలేం



ఈ ఫోటోలో కనిపిస్తున్న ఇళ్లు తెర్లాం మండలం నందబలగలో పెద్దింటి గౌరికి చెందినది. సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో శరవేగంగా నిర్మాణం పూర్తిచేసి గృహప్రవేశానికి సిద్ధం చేశారు. గతంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా ఇల్లు మంజూరు కాలేదు. దీంతో సొంత ఇల్లు లేక నానా అవస్థలు పడ్డారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం కింద ఇల్లు మంజూరు చేయడంతో ఆమె ఆనందానికి అవధులు లేవు. సీఎం చేసిన మేలు మరువలేమని వారు అంటున్నారు.

నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు



నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నాం. హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించి లబ్ధిదారుల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నాం. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుక ఉచితంగా అందిస్తున్నాం. అలాగే సిమ్మెంట్, ఐరన్, ఎలక్ట్రికల్ సామగ్రి, ఇతర సామగ్రిని తక్కువ ధరకే అందంచడంతో పాటు నిర్మాణాలు పూర్తిచేసిన వారికి సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నాం. దీంతో నిర్మాణాలు ఊపందుకున్నాయి.
– పలగర అప్పయ్య, హౌసింగ్ డీఈఈ, బొబ్బిలి

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం..



కాంట్రాక్టు ఉద్యోగుల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగాలను రెగ్యులర్ చేసి తమ కుటుంబాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని కాంట్రాక్టు లెక్చరర్లు అన్నారు. పక్కి గ్రామంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు స్వగృహంలో బుధవారం ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. గత ప్రభుత్వం తమను పట్టించుకోలేదని, కానీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేశారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటేసి జగనన్న రుణం తీర్చుకుంటామన్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే శంబంగి ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు కడుపుమంట: ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: కాంట్రాక్ట్ ఉద్యోగులు కృతజ్ఞతాభావంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పాలాభిషేకాలు చేయడంపై ప్రతిపక్షాలు కడుపుమంటతో రగిలిపోతున్నాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి వారి జీవితాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంట్రాక్టు ఉద్యోగులతో ఊడిగం చేయించుకుని, వారికి మొండి చేయి చూపారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వారికి మేలు జరగడంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఇటీవల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై చేసని వ్యాఖ్యలు వారి వ్యక్తిగతమని, కానీ వాటిని కొందరు వ్యక్తులు బీజేపీ పార్టీకి రుద్దే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై పలుమార్లు ప్రశంసలు కురిపించిన విషయాన్ని గుర్తుచేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ ఇన్‌చార్జి తమ్మిరెడ్డి దామోదరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు చోడిగంజి రమేష్‌నాయుడు, తెంటు పార్వతి, బొత్స రమణమ్మ తదితరులున్నారు.

'జగనన్న ఆణిముత్యం'కు ఎంపిక

బాడంగి: చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రభుత్వం ఆణిముత్యాలు పథకం కింద అందించే నగదు ప్రోత్సాహకానికి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన మీసాల పావని ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వి.శంకరరావు తెలిపారు. ఇంటర్మీడియట్ హెచ్‌ఈసీలో వెయ్యికి 792 మార్కులు సాధించడంతో నగదు ప్రోత్సాహకానికి ఎంపికైనట్లు చెప్పారు. బొబ్బిలి ఏపీ గురుకుల పాఠశాలలో గురువారం నిర్వహించే కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు అవార్డు అందజేయనున్నట్లు చెప్పారు. కళాశాలకు చెందిన విద్యార్థిని నగదు ప్రోత్సాహకానికి ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు.

కోటి కుంకుమార్చన

రాజాం సిటీ: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం కోటి కుంకుమార్చన పూజలు ప్రారంభించారు. ఆర్యవైశ్య సేవాసంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పూజలు 84 రోజులపాటు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 8గంటల వరకు నాలుగు బ్యాచ్‌లుగా పూజలు జరుగుతాయని అన్నారు.

ఉత్తమ బ్లడ్ డోనర్ అవార్డు ప్రదానం

బొబ్బిలి: రక్తదాన దినోత్సవం సందర్భంగా వరల్డ్ బ్లడ్ బ్యాంకు ఉత్తమ సేవామూర్తులకు అవార్డులు అందజేసింది. బొబ్బిలి డివిజన్ నుంచి లంక రమేష్ ఈ అవార్డుకు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎం.గణపతిరావు చేతులమీదుగా లంక రమేష్ ఈ అవార్డును అందుకున్నాడు.

సప్లిమెంటరీలో పెరిగిన ఉత్తీర్ణత

బాడంగి: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో కేజీబీవీ విద్యార్థులు 94 శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యాలయం నుంచి 26 మంది ఫస్ట్‌ఇయర్ పరీక్షలు రాయగా 25 మంది ఉత్తీర్ణత సాధించారు. 13 మంది సెకండ్ ఇయర్ పరీక్షలకు హాజరుకాగా 12 మంది పాసైనట్లు ప్రిన్సిపాల్ ఎస్.నజియా తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి 83 మంది ఫస్ట్‌ఇయర్ పరీక్షలు రాయగా 66 మంది పాసైయ్యారు. సెకండ్ ఇయర్ పరీక్షలకు 99 మంది హాజరుకాగా 85 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ వి.శంకరరావు చెప్పారు. అలాగే సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల నుంచి ఫస్ట్‌ఇయర్‌లో 46 మందికి 39 మంది, సెకండ్ ఇంటర్‌లో 48 మందికి 39 మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ టి.రామదాసు తెలిపారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం



రాజాం సిటీ: రైతులకు విత్తనాల, నవధాన్యాల కిట్లు అందిస్తున్న ఏఓ



రామభద్రపురం: విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

రామభద్రపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతకు అండగా ఉంటుందని, ఆర్‌బీకేల ద్వారా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందించడంతో పాటు పండించిన పంటకు మద్దతుధర చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేస్తూ అన్ని విధాలా ఆదుకుంటోందని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. స్థానిక ఆర్బీకే–2లో వ్యవసాయాధికారి వెంకటయ్యతో కలిసి బుధవారం రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీటీ 3291, ఆర్‌జీఎల్ 2537, ఎంటీయూ 1224, 1061, 1121, 1318 రకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైన రకాల కోసం రైతులు ముందుగా ఆర్బీకేల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

రాజాం సిటీ: మండలంలోని పొగిరి ఆర్‌బీకేలో వద్ద ఏఓ ఎం.రేణుకాసాయి బుధవారం రైతులకు రాయితీపై వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఖరీఫ్‌కు సంబంధించి ముందుగా నమోదుచేసుకున్న వారందరికీ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ఆర్‌బీకేలకు వెళ్లి విత్తనాలు తీసుకోవాలని సూచించారు. వరి విత్తనాలతో పాటు నవధాన్యాల కిట్లు కూడా పంపిణీ చేశారు.

దిశ యాప్‌తో మహిళలకు రక్షణ భరోసా



రాజాం సిటీ: దిశయాప్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు



యువతులతో దిశ యాప్ రిజిస్ట్రేషన్ చేయిస్తున్న ఎస్సై సురేంద్రనాయుడు

రామభద్రపురం: మహిళల భద్రతకు భరోసా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపకల్పన చేసిన దిశా యాప్‌ను ప్రతి ఒక్కరూ తమ స్మార్ట్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎస్సై సురేంద్రనాయుడు కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులతో కలిసి బుధవారం దిశ యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. యాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి, ఎలా వినియోగించాలని, యాప్ పనితీరు తదితర అంశాలను వివరించారు. పలువురితో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. అత్యవసర సమయంలో యాప్‌లోని ఎస్‌ఓఎస్ బటన్ నొక్కడంతో సెకన్ల వ్యవధిలోనే పోలీసులకు అక్కడకు చేరుకుని రక్షిస్తారన్నారు.

రాజాం సిటీ: ప్రతి ఒక్కరూ దిశ యాప్ వినియోగంపై అవగాహన కలిగిఉండాలని టౌన్ సీఐ కె.రవికుమార్ అన్నారు. పట్టణంలోని పలు కూడళ్లలో బుధవారం దిశ యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం కళాశాలలు, పాఠశాలలు ప్రారంభమైన దృష్ట్యా బాలికలు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మొబైల్‌లో దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయంలో వినియోగించాలని సూచించారు.

జూలై నాటికి లక్ష్యాలను పూర్తిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంజనేయులు, హౌసింగ్ డీఈఈ అప్పయ్య

బాడంగి: జగనన్న కాలనీ ఇళ్లు, గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన పనులను త్వరితగతిన పూర్తిచేసి లక్ష్యాలను చేరుకోవాలని ఎంపీడీఓ పీవీఎస్‌జే ఆంజనేయులు, హౌసింగ్ డీఈఈ అప్పయ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా 46 పనులు మంజూరయ్యాయని, వాటిలో ఇంతవరకు 5పనులు మాత్రమే పూర్తిచేశారని, మిగిలిన పనులను త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా మండలంలో జగనన్న కాలనీల్లో 1448 ఇళ్లు మంజూరుకాగా 931 ఇళ్లు చివరి దశకు చేరుకున్నాయని, మిగిలిన నిర్మాణాలను జూలై నాటికి పూర్తిచేయించి సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని డీఈఈ అప్పయ్య సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ సత్యం, వర్క్‌ఇన్‌స్పెక్టర్ వెంకటనాయుడు ఉన్నారు.

ప్రతి ఇంట్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: ప్రతీ ఇంట్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు కనువిందుచేస్తున్నాయని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పట్టణంలోని చాకలివీధి, గొల్లవీధిలో బుధవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ పనితీరు, స్థానిక సమస్యలపై ఆరాతీశారు. సంక్షేమ పథకాల ద్వారా నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందిస్తున్నామన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి ఒక అడుగుముందుకు వేస్తే, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకువేసి నిరుపేదల సంక్షేమానికి పాటుపడుతున్నారన్నారు. పేదలకు పక్కా ఇళ్లు, మెరుగైన వైద్య, విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్య వంటి పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వాన్ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, వంజరాపు విజయ్‌కుమార్, యండమూరి వాసు, జి.పాపారావు, శంకర్, యందవ చిన్నబాబు, కెల్ల సత్యనారాయణ, చిన్న, తవిటినాయుడు, కెల్ల దుర్గారావు, సింబాల రాము, శంకర్, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, మేనేజర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు మోదుగులపేటలో..

సంతకవిటి: మండలంలోని మోదుగులపేట గ్రామంలో ఈ నెల 15న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి బుధవారం తెలిపారు. సాయంత్రం 4గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొంటారని అన్నారు. వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు విధిగా హాజరుకావాలని కోరారు.

త్వరితగతిన రోడ్డు నిర్మించాలి



రోడ్డు విస్తరణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: రాజాం ప్రధాన రహదారి విస్తరణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఎమ్మెల్యే కంబాల జోగులు ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. పట్టణంలో జీఎంఆర్‌ఐటీ రోడ్డులో అప్సర థియేటర్ వద్ద రహదారి విస్తరణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ డీఈఈ ప్రసాద్, ఏఈ నాగభూషణరావు వద్ద పనుల ప్రస్తుత పరిస్థితిపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.20 కోట్లతో రాజాం ప్రధాన రహదారి విస్తరణ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. మరో రెండు నెలల్లో రోడ్డు విస్తరణ పనులు పూర్తికానున్నాయన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, వంజరాపు విజయ్ కుమార్, కరణం సుదర్శనరావు, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు శతశాతం 'ఉపాధి'



మాట్లాడుతున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ

తెర్లాం: మండలంలో ఉపాధిహామీ పథకం జాబ్ కార్డు ఉన్న ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన వేతనదారులందరికీ శతశాతం పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనులపై ఆ పథకం ఏపీఓ సుశీల, సాంకేతిక, క్షేత్ర సహాయకులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల వారీగా ఉపాధి పనులపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతీ ఎస్సీ, ఎస్టీ వేతనదారునికి నూరుశాతం పనులు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. పని కావాలని దరఖాస్తు చేసిన వారికి వెంటనే పని కల్పించాలని, పనులు జరుగుతున్న తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అన్ని పంచాయతీల్లో చెత్తశుద్ధి నిర్వహణ కేంద్రాలు ఉండేలా చూడాలని, ఇంతవరకు కేంద్రాలు లేని పంచాయతీని గుర్తించి ఎస్‌డబ్ల్యూపీసీలు నిర్మించాలన్నారు. ఉద్యాన పంటల సాగుకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. రికార్డుల నిర్వహణలో ఎటువంటి లోపాలు ఉన్నా సహించేదిలేదని హెచ్చరించారు.

జగనన్న విద్యాకానుకల పంపిణీ

విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని భావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. ఒమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలతో పాటు జగనన్న విద్యాకానుకల పేరుతో విద్యార్థుల చదువులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం, బూట్లు తదితర వస్తువులను ఉచితంగా అందజేస్తున్నారు. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో స్థానిక ప్రజాప్రతినిధులు జగనన్న విద్యాకానుక కిట్లను బుధవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. వాటిని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. – సాక్షి నెట్‌వర్క్



రేగిడి: బూరాడ పాఠశాలలో జేవీకే కిట్లను పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ జగన్మోహనరావు, తదితరులు



తెర్లాం: వెలగవలస హైస్కూల్‌లో జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఫల్గుణరావు



రాజాం సిటీ: బొద్దాం ఎంపీపీ పాఠశాలలో జేవీకే కిట్లు అందిస్తున్న హెచ్‌ఎం బి.స్వర్ణరాణి, వైస్ ఎంపీపీ వర్షిణి



రాజాం: మారేడుబాకలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుకలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు యాలాల వెంకటేష్, తదితరులు



వంగర: శివ్వాంలో జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు